ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 5 జూలై 2024





క్యాజువాలిటీలో ఇలా ఒక్కో మంచంపై ఇద్దరికి వైద్య సేవలు ..

ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది పేదలకు పెద్ద దిక్కు.. అనంతపురం సర్వజన వైద్యశాల. ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా, వ్యాధులు ప్రబలినా.. పరిగెత్తుకుంటూ పెద్దాసుపత్రికి వస్తారు. వీరిని అత్యవసరంగా పరీక్షించి.. తగిన వైద్యసేవలు అందించి.. ప్రాణాలు కాపాడటంలో కీలకంగా పనిచేసే విభాగం.. క్యాజువాలిటీ..! ఇలాంటి చోట తగినన్ని పడకలు, మౌలిక వసతులు కల్పించాలి. కానీ అలాంటివేవీ కనిపించవిక్కడ..! రోజుకు 300 నుంచి 400 మంది వరకూ రోగులు క్యాజువాలిటీకి వస్తారు. కానీ ఉన్న పడకలు 20 మాత్రమే..! అత్యవసర వైద్యం అందించి.. సంబంధిత విభాగాలకు పంపేందుకు కనీసం గంట పడుతుంది. ఒక్కోసారి ఎన్ని గంటలు పడుతుందో చెప్పలేం. అప్పటిదాకా ఆ 20 పడకల్లోనే అందరూ సర్దుకోవాలి. ఒక్కో పడకపై ఇద్దరు, ముగ్గురు, నలుగురు.. ఇలా.. ఎంత మంది పడితే అంతమంది..! చోటు లేకపోతే వీల్‌చైర్, స్ట్రెచర్, ఫ్లోర్.. ఇలా ఏదో ఒకచోట కూర్చునో.. కూలబడో చికిత్స చేయించుకోవాలి. జిల్లా కేంద్రంలో ఇంత దుర్భర పరిస్థితి కొనసాగుతున్నా.. ఏ ఒక్కరికీ పట్టడం లేదు. కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ఒక్క పది నిమిషాలు క్యాజువాలిటీ వద్ద నిలబడితే చాలు.. సమస్య తీవ్రత అర్థమౌతుంది. గత పాలకులు గాలికి వదిలేశారు. కొత్త ప్రభుత్వం.. ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కాస్త చొరవ చూపితే రోగులకు నరకం తప్పుతుంది.

- అనంతపురం టౌన్

ఎప్పటికీ ఇంతేనా?

క్యాజువాలిటీలో దయనీయ పరిస్థితులు

- అత్యవసర రోగులకు పడకల కొరత
- ఒక మంచంపై ఇద్దరు ముగ్గురికి వైద్యం
- వీల్ చైర్లు, స్ట్రెచర్లు.. నేలపైనా చికిత్సలు
- పెద్దాసుపత్రిని గాలికి వదిలేసిన పాలకులు



వీల్‌చైర్‌మీదే వైద్యం

ప్రాణాలు నిలబెట్టే చోటు..

అత్యవసర వైద్య విభాగం అంటే.. పోయే ప్రాణాలను నిలపాల్సిన చోటు. అలాంటి చోట వైద్య సదుపాయాలు, వైద్యులు, సిబ్బంది విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు. కానీ అనంత పెద్దాసుపత్రిలో ఆ పరిస్థితి లేదు. అసౌకర్యాల నడుమ వైద్యులు, సిబ్బంది కుస్తీ పట్టాల్సి వస్తోంది. తాజాగా అతిసార కేసులు వందల సంఖ్యలో వస్తున్నాయి. కానీ పడకలు లేవు. ఒక్కో పడకపై ముగ్గురు నలుగురికి సెలైన్ ఎక్కిస్తున్నారు. బాటిళ్లు అయిపోగానే ఇళ్లకు పంపుతున్నారు. పాముకాటు, తేలు కాటు బాధితులు, ఆస్తమా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు క్యాజువాలిటీలో వైద్యం నరక ప్రాయంగా మారుతోంది. వైద్యులు, సిబ్బంది నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు. డబ్బున్న వారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. పేదలు పెద్దాసుపత్రికి వచ్చి ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు.

మాటలతో గడిపేశారు..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు మాటలతో కాలక్షేపం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆస్పత్రులలో అవసరమైన వసతులు కల్పిస్తామని అన్నారు. తగినంత మంది వైద్యులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తామని అన్నారు. దీంతో అనంత పెద్దాసుపత్రి క్యాజువాలిటీని పునరుద్ధరించి, పడకలు పెంచుతామని అన్నారు. వారి హామీలు ఏ మేరకు నెరవేరాయో కళ్లారా కనిపిస్తున్నాయి.

వసతులు పెంచాలి



సర్వజన వైద్యశాల జిల్లాకు గుండెలాంటిది. మన జిల్లాతో పాటు ఇతరప్రాంతాల వారు కూడా ఇక్కడికి చికిత్స కోసం వస్తుంటారు. అందుకే అత్యవసర చికిత్సలు అందించే విభాగాలలో వసతులు, డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు మాటలతో కాలం గడిపేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించాలి. అత్యవసర వైద్యసేవలు అందించే విభాగాలకు ఏమికావాలో తెలుసుకుని, ఆ మేరకు వసతులు కల్పించాలి. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి. - రాంభూపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి

వెయ్యి పడకలకు పెంచాలి..



ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి సామర్థ్యం 560 పడకలు మాత్రమే. కానీ వెయ్యి నుంచి 1200 వందల వరకు అడ్మిషన్ పొంది చికిత్స చేయించుకుంటున్నారు. క్యాజువాలిటీకి కూడా రోజుకు 300 పైగానే అత్యవసర కేసులు వస్తున్నాయి. అక్కడ ఉన్న 20 పడకలు చాలడంలేదు. క్యాజువాలిటీని ఇటీవల ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంగా మార్చాం. అందులో మెడిసిన్ విభాగం హెచ్‌ఓడీతోపాటు ఒక అసోసియేట్ ప్రొఫెసర్, నలుగురు అసిసెంట్ ప్రొఫెసర్లు, ముగ్గురు పీజీలు, ఎంబీబీఎస్ డాక్టర్లు ముగ్గురు ఉంటారు. వచ్చిన కేసులను పరీక్షించి, ప్రథమ చికిత్సలు అందిస్తారు. ఏ కేసును ఏ వార్డుకు తరలించాలో కేస్ షీట్‌లో రాసి పంపిస్తారు. దీనివల్ల క్యాజువాలిటీలో కొంత సమస్య తీరనుంది. సమస్య పూర్తిగా పరిష్కారం కావాలంటే ఆస్పత్రి సామర్థ్యాన్ని వెయ్యి పడకలకు పెంచాలి. - డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ

మంత్రి సీరియస్‌గా తీసుకోవాలి..



జిల్లా ఆస్పత్రిలో యుద్ధ ప్రాతిపదికన వసతులు పెంచాలి. వైద్య శాఖ మంత్రిగా ఉమ్మడి జిల్లాకు చెందిన సత్యకుమార్ ఉన్నారు. ఆయన ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. అపుడే ఆస్పత్రిలో వసతులు పెరుగుతాయి. రోగులకు కష్టాలు తీరి సకాలంతో వైద్య సేవలు అందుతాయి.

- జాఫర్, సీపీఐ జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా..



జిల్లా ఆస్పత్రిలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం. సీఎం చంద్రబాబు, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్, వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అధికారులకు పరిస్థితిని తెలియజేస్తాం. ఎంపీతో కలిసి ఇప్పటికే ఆస్పత్రిని సందర్శించాను. కొన్ని వార్డులను పరిశీలించాము. సమస్యలపై నివేదిక తెప్పించుకున్నాము. అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రభుత్వానికి తెలియజేసి, అవసరమైన వసతుల ఏర్పాటుకు కృషిచేస్తాం.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే



అతిసారతో ఆస్పత్రికి వచ్చిన పసివాడికి.. ఇలా నేలే పడకైంది..



అటు నువ్వు.. ఇటు నేను.. సర్దుకుందాం అక్కా.



పోయే ప్రాణాలు నిలిపే చోట.. దయనీయ పరిస్థితులు..



ఈ నెల 2న.. మృతదేహం ఉన్న బెడ్‌పై ఇద్దరు యువకులకు వైద్యం



ఒకే పడక..! ఒకరు పడుకుని.. ఇద్దరు కూర్చుని.. అత్యవసర వైద్యం

మాకూ శిక్షణ ఇవ్వండి!

బీసీ స్టడీ సర్కిల్



ప్రభుత్వానికి ఆర్థికంగా వెనుకబడిన ఓసీల వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 4: ఆర్థికంగా వెనుకబడిన ఓసీలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రకటించింది. విద్య, ఉద్యోగాలు, ఉపాధి సహా అన్నింటీ వారికి పదిశాతం రిజర్వేషన్లు అమలవ్వాలి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు ఇచ్చే ఉచిత శిక్షణలోనూ 10 శాతం కోటా కల్పించాలి. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఉన్నా.. అందులో ఈడబ్ల్యూఎస్ కోటా కేటాయించలేదు. దీంతో జిల్లాలో వందలాది మంది ఆ వర్గాలవారు శిక్షణకు దూరమయ్యారు. అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్, రాష్ట్రస్థాయి అధికారులు సైతం పట్టించుకోలేదు. ఇలా ఈడబ్ల్యూఎస్ కోటా అటకెక్కింది. టీడీపీ కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించారు. కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు మాత్రమే అవకాశం కల్పించారు. తమకూ అవకాశం ఇవ్వాలని ఆర్థికంగా వెనుకబడి ఓసీ వర్గాల అభ్యర్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొందరు బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈడబ్ల్యూఎస్‌కు అవకాశం లేదని అధికారులు చెబుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

- డీఎస్సీ శిక్షణలో కనిపించని ఈడబ్ల్యూఎస్ కోటా
- అనుమతి లేదంటున్న బీసీ సంక్షేమ శాఖ అధికారులు
- వైసీపీ ప్రభుత్వంలో అందని గ్రూప్-1, 2 శిక్షణ

అనుమతి ఇవ్వలేదు..



డీఎస్సీ ఉచిత శిక్షణలో ఈడబ్ల్యూఎస్ కోటాకు అనుమతి ఇవ్వలేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి మాత్రమే దరఖాస్తులు స్వీకరించమని ఆదేశాలు ఉన్నాయి. ఆ మేరకే దరఖాస్తులు ఆహ్వానించాం. ఈ నెల 7వ తేదీ వరకూ మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తాం. అంతటితో గడువు ముగుస్తుంది.

- కుష్బూ కొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

ప్రభుత్వమే ఆదుకోవాలి



డీఎస్సీ ఉచిత శిక్షణలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేయాలి. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. లేదంటే మాలాంటి ఎంతో మంది ఓసీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సరైన శిక్షణ లేకపోతే ఉద్యోగాలకు దూరమౌతాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆలోచించి మాకు న్యాయం చేయాలి.

- వేణుగోపాల్ రెడ్డి, అనంతపురం

చొరవ చూపాలి..

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణకు నాలుగు రోజుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. బీసీలకు 66, ఎస్సీలకు 20, ఎస్టీలకు 14 శాతం సీట్లను కేటాయించారు. ఆ నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి.. శిక్షణ ఇస్తారు. కానీ ఈడబ్ల్యూసీ కోటా కింద దరఖాస్తులను స్వీకరించడం లేదు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు చొరవ చూపితే ఆర్థికంగా వెనుకబడిన ఓసీలకూ న్యాయం జరుగుతుంది. గతంలో గ్రూప్-1, గ్రూప్-2 ఉచిత శిక్షణ విషయంలో ఈడబ్ల్యూఎస్‌కు అవకాశం కల్పించలేదు. అప్పట్లో ఎంతో మంది అభ్యర్థులు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఉషశ్రీ చరణ్ దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఫలితం లేకపోయింది. మంత్రిగా సవిత తమకు న్యాయం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఓసీలను ఆదుకోవాలి..



డీఎస్సీ ఉచిత శిక్షణ గురించి పత్రికల్లో చూసి బీసీ స్టడీ సర్కిల్‌కు వచ్చాను. దరఖాస్తు చేసుకునేందుకు అప్లికేషన్ అడిగితే.. ఇక్కడి అధికారులు ఈడబ్ల్యూ ఎస్‌కు అవకాశం లేదని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల నుంచి మాత్రమే దరఖాస్తులను స్వీకరించాలని సూచించారట. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఓసీ వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి అన్యాయం జరుగుతోంది. ఈ విషయంలో రాష్ట్రస్థాయి అధికారులు స్పందించాలి. ఈడబ్ల్యూఎస్‌కు అవకాశం కల్పించాలి.

- అరుణ, అనంతపురం

మంత్రి చొరవ చూపాలి..



గ్రూప్-1, గ్రూప్-2 విషయంలో ఈడబ్ల్యూఎస్‌ను లేకుండా చేశారు. ఇప్పుడు డీఎస్సీ కోచింగ్ కోసం వస్తే ఇక్కడి అధికారులు మళ్లీ ఈడబ్ల్యూఎస్ లేదని చెబుతున్నారు. మాలాంటి వాళ్లు వేలకు వేలు డబ్బులు కట్టి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకోము. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఈ విషయంలో కలుగజేసుకుని మాకు న్యాయం చేయాలి.

- కె శిల్ప, అనంతపురం

మన్యం వీరుడికి ఘన నివాళి



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం టౌన్, జూలై 4: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆదర్శప్రాయుడని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ కొనియాడారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అల్లూరి 127వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అల్లూరిలాంటి మహనీయుడు మన రాష్ట్రంలో జన్మించడం గర్వకారణమని అన్నారు. అణగారిన వర్గాలు, గిరిజనుల సంక్షేమానికి ఆయన చేసిన పోరాటం మరవలేనిదని అన్నారు. రాష్ట్రంలోని రంపచోడవరం, పార్వతీపురం తదితర గిరిజన ప్రాంతాలలో తాను పనిచేశానని, అల్లూరి తిరిగిన ప్రాంతాలను సందర్శించానని అన్నారు. ప్రతి ఒక్కరూ అల్లూరి స్ఫూర్తితో వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర పాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్వో రామకృష్ణారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు రామాంజినేయులు, కుష్బూ కొఠారి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య విభాగం.. కంపు..!



అవినీతి ఆరోపణలు ఉన్నా.. అందలం

అనంతపురం క్రైం, జూలై 4: అనంతపురం నగరంలో అపరిశుభ్రత ఏ స్థాయిలో ఉందో.. నగరపాలికలోని పారిశుధ్య విభాగంలో అవినీతి కంపు అంతే స్థాయిలో ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారి మొదట్లో ఇంటి నుంచి శుభ్రంగా మధ్యాహ్న భోజనం తెచ్చుకునేవారట. ఇప్పుడు రోజూ నగరంలోని రెస్టారెంట్‌లకు వెళుతున్నారని సమాచారం. తాను తినడంతోపాటు.. ఇంటికెళ్లే సమయంలో పార్శిల్ తీసుకుపోతుంటారని అంటున్నారు. పారిశుధ్య విభాగంలో చాలా మంది కీలక ఉద్యోగులు నగర పరిశుభ్రత కంటే.. అక్రమార్జన పైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. మేస్త్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పోస్టులు వారి జేబులు నింపుతున్నాయి. ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్లాస్టిక్ నిషేధం పేరుతో తనిఖీలు చేస్తూ.. జేబులు నింపుకుంటున్నారు. ఇలా అవినీతిలో మునిగి తేలుతుంటే.. పాలక వర్గం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తోంది. నగరపాలిక ఉన్నతాధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.


- అమ్మకానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుర్చీలు
- కుక్క పిల్ల.. బిర్యానీ.. నగదు.. ఏదైనా ఇవ్వొచ్చు
- ట్రేడ్ లైసెన్సుల పేరిట అదనపు వసూళ్లు
- కాసులు కురిపిస్తున్న ప్లాస్టిక్ నిషేధం

నా దృష్టికి రాలేదు..

నగరపాలిక పారిశుధ్య విభాగంలో అవినీతి జరిగిన విషయం నా దృష్టికి రాలేదు. నగరంలో మూడు సర్కిళ్ల పారిశుధ్యం పనులను నేను పర్యవేక్షిస్తున్నాను. అయినా శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నియామక ఫైల్ నా వద్దకు రాదు. ఆ ఫైల్ నేరుగా కమిషనర్‌కు వెళ్తుంది.

- శ్రీహరి బాబు, అడిషనల్ కమిషనర్

ముడుపులు ఇచ్చారా..?



శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుల కోసం కొందరు భారీగా ముడుపులు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఒకరు రూ.70 వేలు, ఒక జూలు కుక్క పిల్లను కానుకగా సమర్పించారట. మరొకరు రూ.40 వేలు, ఇంకొకరు రూ.60 వేలు ఇచ్చారట. నిందారోపణలు ఎదుర్కొంటున్న ఓ ఉద్యోగి రూ.80 వేలు చెల్లించారని సమాచారం. ఇందులో అధికశాతం ఓ కీలక అధికారి జేబులోకి వెళ్లినట్లు సమాచారం. ఓ యువకుడిని మూడు నెలల క్రితం ఔట్‌సోర్సింగ్ వర్కర్‌గా తీసుకున్నారు. అతనికి రెండు నెలల జీతం రాకనే అప్పుడే మేస్త్రీ హోదా అప్పగించారట. రూ.80 వేలు సమర్పించుకుని.. అవకాశం దక్కించుకున్నట్లు సమాచారం.

అదనపు వసూళ్లు..?



నగర పరిధిలో దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్ కోసం ఏడాదికి ఒకసారి రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చిన్న దుకాణమైతే రూ.500, వాణిజ్య దుకాణమైతే రూ.1000 నుంచి రూ.25 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిలోనూ శానిటేషన్ సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారని సమాచారం. కమర్షియల్ విభాగం విషయంలో ఈ వసూళ్లు ఎక్కువైనట్లు సమాచారం. తొలుత కీలక అధికారికి షాప్ చూపిస్తారని, ఆయన ఏదో లెక్కలు వేసి రూ.10వేలు అని చెబుతారని, దీంతో తగ్గించుకోవాలని దుకాణదారుడు బేరం పెడతారని సమాచారం. ఇలా.. దారికి తెచ్చుకుని.. సగానికి తగ్గించేస్తారని అంటున్నారు. నగరంలో వందల సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు, బార్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ పెద్ద పెద్ద హోటళ్లు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించరు. అలాంటి వారి నుంచి 'వన్‌టైమ్' సెటిల్‌మెంట్ చేసుకుని భారీగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.

సీటు కోసం లంచం..

పారిశుధ్యం విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సీటు కావాలంటే అడిగినంత ఇవ్వాల్సిందే అని ప్రచారం జరుగుతోంది. నిబంధనల మేరకు రెగ్యులర్ ఉద్యోగులనే శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలి. కానీ ఆ స్థానంలో మేస్త్రీలను నియమిస్తున్నారు. అందులోనూ అనుభవమున్న వారికి కాకుండా.. అక్రమార్కులకే చోటిస్తున్నారు. గతంలో సస్పెండ్ అయినవారిని అందలం ఎక్కించడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న వారిలో ఒకరికి మినహా.. అర్హత లేదని అంటున్నారు. నగరపాలిక పరిధిలో మొత్తం 50 డివిజన్లకు గాను ఆరు సర్కిళ్లు ఉన్నాయి. ఆ సర్కిళ్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లే పారిశుధ్యాన్ని పర్యవేక్షిస్తారు. మూడు వారాల క్రితం కొన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టుల్లో మేస్త్రీలను కూర్చోబెట్టారు. ఒకటో సర్కిల్‌కు హర్షవర్ధన్, ఐదో సర్కిల్‌కు పాల్‌రాజును నియమించారు. వారిద్దరూ మేస్త్రీలుగా ఉన్న సమయంలో అప్పటి కమిషనర్ భాగ్యలక్ష్మి సస్పెండ్ చేశారు. వారికి రెండేళ్ల అనుభవం లేకపోయినా శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. మూడో సర్కిల్‌కు నియమించిన ఆంజినేయులుపై విజిలెన్స్ కేసు ఉంది. అతనికి ఆ పోస్టు కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. రెండో సర్కిల్‌కి కేటాయించిన నాగేంద్ర సైతం మేస్త్రీ కావడం గమనార్హం.

ఇష్టారాజ్యం..

శానిటరీ సెక్రటరీల విషయంలో మరోసారి మార్పు చేశారు. మేస్త్రీగా ఉన్న వెంకటేష్‌ను నాలుగు రోజుల క్రితం మరోసారి లైన్‌లోకి తీసుకొచ్చారు. మూడో సర్కిల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. మూడో సర్కిల్‌లో పనిచేస్తున్న ఆంజనేయులును ఐదో సర్కిల్‌కు మార్చారు. ఐదో సర్కిల్‌లో పనిచేస్తున్న పాల్‌రాజును ఆరో సర్కిల్‌కు మార్చి.. ఆ సర్కిల్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సచివాలయ సెక్రటరీని పక్కనపెట్టేశారు. అక్రమాలపై వివరణ కోరేందుకు కమిషనర్‌కు ఫోన్ చేయగా.. స్పందించలేదు.

ఏం చేద్దామంటావ్ మరి..?



పారిశుధ్య విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ అధికారి స్థానికంగా లేరు. నిబంధనల ప్రకారం స్థానికంగానే ఉండాలి. కానీ ఆ సారు ఉదయం 6గంటలకు నగరానికి వచ్చేస్తారు. మొదట్లో ఇంటి నుంచి భోజనం తెచ్చుకునేవారు. కానీ అవినీతి కంపు తోడయ్యాక రెస్టారెంట్లకే వెళ్తారట. ప్రత్యేకంగా బిర్యానీ తెప్పిస్తారట. ఆయన కింద ఉన్న అవినీతి ఉద్యోగులు టిఫిన్, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పిస్తున్నారట. ఏదైనా కాలువల్లో మురుగు సరిగా వెళ్లడం లేదని శానిటేషన్ సెక్రటరీలు ఆయన దృష్టికి తీసుకెళ్తే 'ఏం చేద్దామంటావ్ మరీ..? యంత్రాలు వస్తే మీ ఇష్టమొచ్చినట్లు చేసుకోండి..' అని అసహనం వ్యక్తం చేస్తారట. ప్లాస్టిక్ నిషేధం తనిఖీలకు శానిటేషన్ సెక్రటరీలను తీసుకువెళ్లడం లేదని సమాచారం. జరిమానాలను సైతం ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా, కొంత మొత్తం జేబుల్లోకి మళ్లిస్తున్నట్లు సమాచారం. కొందరు రాజకీయ నాయకులు చెప్పిన దుకాణాలకు అసలే వెళ్ళడం లేదని తెలుస్తోంది.

మరమ్మతులకు శ్రీకారం

- మారనున్న రహదారుల రూపురేఖలు

- ప్రణాళిక సిద్ధం చేసిన అర్‌అండ్‌బీ అధికారులు..
- రూ.కోట్ల అంచనాలతో నివేదిక..
- గత ప్రభుత్వంలో మూడేళ్లే కేటాయింపు..
- అధ్వాన స్థితిలో రోడ్లు.. అవస్థల్లో ప్రజలు..
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అనంతపురం సిటీ, జూలై 4: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రహదారుల మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పూర్తిగా దెబ్బతిన్న, గుంతలమయమైన రహదారులు (రాష్ట్ర రహదారులు, జిల్లా మేజర్ రోడ్లు) వెంటనే గుర్తించి తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని ప్రభుత్వం అధికారులను అదేశించింది. దీంతో ఆశాఖ అధికారులు ఎంతో వేగవంతంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరమ్మతులకు రూ. 13 కోట్లతో కూడిన నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. సీఎం చంద్రబాబునాయుడు సైతం రెండు రోజుల కింద ఆశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి రహదారుల స్థితిగతులపై ఆరా తీసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం ఇలాంటి వాటికి శ్రీకారం చుట్టడంతో దయనీయస్థితికి చేరిన ఆర్‌అండ్‌రోడ్ల రూపు రేఖలు మారేనా..? అని ఆశాఖలో చర్చ సాగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కేటాయింపు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రహదారులు ఆధ్వానస్థితికి చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. నూతన ప్రభుత్వంలోనైనా.. ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మత్తులు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శ్రీ సత్యసాయి జిల్లా దామాజిపల్లి నుంచి తాడిపత్రికి వెళ్లే రహదారి ఇలా..





కొక్కంటి క్రాస్‌లోని రహదారి

విడపనకల్లు నుంచి గడేకల్ రోడ్డు ఇలా..

● ప్రణాళిక సిద్ధంచేసిన అధికారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత ఐదేళ్లలో అర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు లేకపోవడంతో ఎక్కడిక్కడ రోడ్లు దయనీయ స్థితికి చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మత్తులకు శ్రీకారం చుట్టింది. ఆ దిశగా ప్రణాళిక సిద్ధం చేయాలని అదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశాఖ అధికారులు హుటాహుటిన రోడ్లను పరిశీలించారు. గత ప్రభుత్వంలో రహదారుల దుస్థితితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గోతుల రోడ్లతో పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలూ ఉన్నాయి. అయినా నాటి ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు.

ఉమ్మడి జిల్లా పరిధిలో అధికారులు పంపిన నివేదిక

- అనంతపురం జిల్లాలో మేజర్ రహదారుల మరమ్మతులు	: రూ. 9.24 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో మేజర్ రహదారులకు	: రూ.2.23 కోట్లు
- అనంతపురం జిల్లాలో స్టేట్ హైవేస్ రహదారులు	: రూ. 1.13 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో స్టేట్ హైవేస్ రహదారులకు	: రూ. 40 లక్షలు

రహదారుల మరమ్మతులకు పంపిన నివేదిక మొత్తం: రూ. 13 కోట్లు

ప్రభుత్వానికి నివేదిక పంపాం..

కొత్త ప్రభుత్వం దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లపై నివేదిక పంపాలని అదేశించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరిశీలించి రూ. 13 కోట్లతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నిధులు కేటాయించగానే.. పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం.



\- ఓబుల్‌రెడ్డి, ఎస్ఈ, అర్‌అండ్‌బీ



కల్లూరు నుంచి గార్లదిన్నెకు వెళ్లే రహదారి

గత ప్రభుత్వంలో నిధులు అంతంతే...

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్లను పూర్తిగా విస్మరించింది. ఎక్కడిక్కడ సదరు రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. ఆ దారుల గుండా ప్రయాణం చేయాలంటే నరకం చవిచూడాల్సిన దుస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది. అధికార లెక్కల ప్రకారం.. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో మొదట రెండేళ్లు ఒక్కపైసా కూడా రోడ్ల మరమ్మత్తులకు నిధులు కేటాయించలేదు. తద్వారా రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా మారినట్లైంది. ఆ తర్వాత మూడేళ్లలో కేవలం అడపదడపా నిధులు కేటాయించి మమ అనిపించారనే విమర్శలు లేకపోలేదు. అదీకూడా ఎన్నికలు వస్తాయి.. కదా..? అని నామమాత్రపు నిధులు కేటాయించారనే విమర్శలు లేకపోలేదు. అప్పట్లో అర్‌అండ్‌బీ రోడ్ల దుస్థితిపై జనసేనాని కూడా వైసీపీపై విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో వైసీపీ ఆర్‌అండ్‌బీ రోడ్లను పూర్తిగా ఆధ్వానస్థితి తీసుకెళ్లిందనడంలో ఏమాత్రం సందేహాలు లేకపోలేదు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

అనంతపురం విద్య, జూలై 4: నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. బంద్ సందర్భంగా విద్యార్థి సంఘాలు నగరంలో ర్యాలీ నిర్వహించాయి. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, జేఎన్‌టీయూలో సైతం బంద్ చేయించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షలను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం కూడా నీట్‌పై కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, నరేష్, వీరేంద్ర ప్రసాద్, అబ్దుల్ ఆలం, వినోద్‌కుమార్, సాయికుమార్, రమణయ్య, ప్రతిభా భారతి, మంజునాథ్, ఉమా మహేష్, వంశీ, హరికృష్ణ, సోము, నాని, ఓబులేషు, బాలకృష్ణ, పవన్, రారాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎస్ బీఎన్ కాలేజీలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

ముగ్గురికి జన్మనిచ్చి.. కన్నుమూసిన తల్లి

మోటువారుపల్లిలో విషాదం నింపిన ఘటన

పెనుకొండ రూరల్, జూలై 4: ఒకే కాన్పులో ముగ్గురు బిడ్డలకు జన్మనిచ్చి.. తల్లి కన్నుమూసింది. పెనుకొండ మండలం మోటువారుపల్లికి చెందిన కె.వెన్నెల(24) అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లికి చెందిన నాగలింగమయ్య, నాగసుబ్బమ్మ దంపతుల కూతురు వెన్నెలకు మూడేళ్ల క్రితం మోటువారిపల్లికి చెందిన గిరినాథ్‌తో వివాహం జరిగింది. గర్భంలో ముగ్గురు శిశువులు ఉండటంతో ఆమె బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో క్రమం తప్పకుండా వైద్యం చేయించుకునేది. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రసవం కోసం వారం క్రితం అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అడ్మిట్ అయ్యింది. గతనెల 30న ఆమెకు పురిటి నొప్పులు అధికం కావడంతో వైద్యులు సిజేరియన్ చేశారు. ఇద్దరు మగశిశువులు, ఒక ఆడశిశువుకు ఆమె జన్మనిచ్చింది. ముగ్గురు శిశువులూ ఆరోగ్యంగా ఉన్నారు. వెన్నెలకు బీపీ తగ్గిపోవడంతో కోమాలోకి వెళ్లింది. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వెన్నెల మృతితో మోటువారిపల్లి, కురుబవాండ్లపల్లి గ్రామాల్లో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మోటువారిపల్లికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వెన్నెల మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.





వెన్నెల మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి, వెన్నెల (ఫైల్)

యూపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి



అనంతపురం టౌన్, జూలై 4 : ఈనెల 7వ తేదీన జిల్లాలో జరగనున్న యూపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణకు ఎంపికైన అదికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ఆదివారం యూపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఉదయం 9-30 గంటలనుంచి 11-30 గంటల వరకు ఈపీఎఫ్‌ఓ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటలనుంచి 4గంటల వరకు ఈఎస్‌ఐసీ పరీక్ష జరుగుతుందన్నారు. ఈపీఎఫ్‌ఓ పరీక్షకు ఉదయం 434 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం జరిగే ఈఎస్‌ఐసీ పరీక్షకు 2,109 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఈపీఎఫ్‌ఓ పరీక్షకు రెండు కేంద్రాలు, ఈఎస్‌ఐసీ పరీక్షకు ఆరు కేంద్రాలు జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేశారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం సూపర్‌వైజర్లు, రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, బస్సు వసతి కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు రాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు నిబంధనలు పాటించాలని, వేళకు ముందే పరీక్షకు హాజరు కావాలన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి

- ‘జలశక్తి అభియాన్’పై సమీక్షలో సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్

అనంతపురం టౌన్, జూలై 4: ప్రతి వర్షపు నీటి బొట్టును వృథా కాకుండా ఒడిసి పట్టి భూగర్భజలాలను పెంచాలని డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్‌కామర్స్ సెంట్రల్ అధికారి అరులానందన్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ‘జలశక్తి అభియాన్’ అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా అరులానందన్ మాట్లాడుతూ జలశక్తి కింద జిల్లాలో పనులు చేపట్టడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో నీటి లభ్యత పెరిగేలా పనులు చేపట్టాలన్నారు. కురిసిన వర్షపు నీటిని వృథా పోకుండా చూసి ఒడిసి పట్టి నీటి జలాలు పెరిగేలా చూడాలన్నారు. ఇంకుడు గుంతల వల్ల కూడా నీరునిల్వ ఉండి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మూడురోజుల పాటు జలశక్తి అబియాన్ కింద చేపట్టిన పనులను పరిశీలిస్తామని, ఇంకా నీటి లభ్యత పెరగడానికి ఎలాంటి పనులు చేపట్టాలో చూస్తామన్నారు. అనంతలో జల లభ్యత పెరగడానికి కృషి చేయాలన్నారు. అధికారులు సమష్టిగా పనిచేసి జిల్లా అబివృద్ధికి పాటు పడాలని కోరారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులను బలోపేతం చేయడమే లక్ష్యంగా మనమందరం పనిచేద్దామన్నారు. ఫారంపాండ్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఐఈసీ యాక్టివిటీలను చేపట్టాలని అదికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ షరీఫ్ ఎఖాన్, వివిధశాఖల ఉన్నతాదికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సెంట్రల్ నోడల్ అధికారి అరులానందన్, కలెక్టర్ వినోద్ కుమార్



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి పయ్యావుల

కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి పయ్యావుల

ఉరవకొండ, జూలై 4: ఢిల్లీలో సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు, రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నులు శాసన సభ వ్యవహారాల శాఖామంత్రి పయ్యావుల కేశవ్ గురువారం కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, నితిన్ గడ్కరిని వారు కలిశారు.

ఆముదం పంటతో అధిక లాభాలు

ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం, జూలై 4: ఉమ్మడి జిల్లాలో మెట్ట సాగులో వేరుశనగ పంటకు ప్రత్యామ్నాయంగా ఆముదం పంట దిట్ట అని రేకలకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రేకలకుంటలోని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కార్యాలయంలో ఆముదం (సంకర రకం ఐసీహెచ్) విత్తనాలతో పాటు సైకిల్ వీడర్, వ్యవసాయ ఉపకరణాలు పలువురు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట అధికంగా సాగు చేస్తున్నారన్నారు. సకాలంలో వర్షాలు రాకపోతే.. తీవ్ర నష్టం తప్పదన్నారు. ఆముదం పంట అయితే మెట్ట పంటలో కొంచెం వర్షం తక్కువైనా పంట చేతికి వస్తుందన్నారు. రైతులు పంట మార్పిడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయంలో మెలకువలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆముదం సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త దుర్గాప్రసాద్, గుత్తా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు, ఉపకరణాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు



స్వాధీనం చేసుకున్న డబ్బుతో డీఆర్‌ఎం కార్యాలయంలోకి వెళ్తున్న సీబీఐ అధికారులు

రైల్వే అవినీతిపై సీబీఐ వల

- అదుపులో సీనియర్ డీఎఫ్‌ఎం సహా ఐదుగురు
- గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయంలో రాత్రిదాకా విచారణ

గుంతకల్లు, జూలై 4: అనంతపురం జిల్లా గుంతకల్లు డివిజనల్ రైల్వే కార్యాలయంలో అవినీతి చేపలు సీబీఐ వలకు చిక్కాయి. కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్‌లో అవినీతికి పాల్పడిన అధికారులను గురువారం సాయంత్రం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు, గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని కడప వద్ద రైల్వేవంతెన నిర్మాణ పనులు దక్కించుకున్న ఓ కాంట్రాక్టరును రైల్వే అకౌంట్సు శాఖ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. ఈ పనులకు ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించగా, కడపకు చెందిన ఓ కాంట్రాక్టరు ప్రైజ్ బిడ్డర్ అయ్యారు. పనికి సంబంధించి అక్సెప్టెన్సీ లెటరును జారీ చేయడానికి సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజరు (సీనియర్ డీఎఫ్‌ఎం) కె.ప్రదీప్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంటు బాలాజీ, ఇతర సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేశారు. సాధారణంగా ఇచ్చే డబ్బుకన్నా ఎక్కువ అడగటంతో సంబంధిత కాంట్రాక్టరు సీబీఐ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు గురువారం సాయంత్రం లంచం డబ్బును ఓ ఉద్యోగికి ఇచ్చాడు. అదే సమయంలో సీబీఐ అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ అవినీతిలో ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ బాలాజీతోపాటు మరో ఇద్దరు ఉద్యోగులను అదుపులో తీసుకున్నారు. సీనియర్ డీఎఫ్‌ఎం ప్రదీప్ బాబు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతున్న ఓ కార్యక్రమంలో ఉన్నారని తెలిసి.. అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ఆయనను డీఆర్‌ఎం కార్యాలయానికి తీసుకువచ్చారు. డీఆర్‌ఎం వినీత్ సింగ్ జోనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో ఉండగా, అత్యవసరంగా పిలిపించి విషయాన్ని తెలియజేశారు. గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులకు కూడా సమాచారం అందజేశారు. ఆ తర్వాత డీఆర్‌ఎం సమక్షంలో అకౌంట్స్ శాఖ సిబ్బందిని మీటింగ్ హాల్‌కు రప్పించి, నిందితులను విచారించారు. సీనియర్ డీఎఫ్‌ఎం ఇంటికి రాత్రి 7 గంటల సమయంలో కొందరు సీబీఐ అధికారులు వెళ్లి, ఆయన సతీమణి నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇంటిని సోదా చేసేందుకు ఇతర అధికారుల కోసం వేచి ఉన్నారు. డీఆర్‌ఎం కార్యాలయంలో సీబీఐ అధికారులు రాత్రి తొమ్మిది గంటల వరకూ విచారించారు. ఆ తర్వాత రిపోర్టు రాసే పనిలో పడ్డారు.

సమస్యలు లేని హాస్టళ్లుగా తీర్చిదిద్దాలి

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు

అధికారులకు మంత్రి సవిత ఆదేశం



సమస్యలను మంత్రికి విన్నవిస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, జూలై 4: రాష్ట్రవ్యాప్తంగా సమస్యలు లేని హాస్టళ్లుగా తీర్చిదిద్దాలని బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లాకు చెందిన బీసీ వెల్ఫేర్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో విద్యార్థులపట్ల అశ్రద్ధ వహించారని, తెలుగుదేశం పాలనలో హాస్టల్ విద్యార్థులపట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులను తల్లి దండ్రులు ప్రైవేట్ బడుల్లో చదివించలేక ప్రభుత్వ పాఠశాలలో, హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలుంటాయన్న నమ్మకంతో విద్యార్థులను వదిలి వెళ్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సరైన విద్యాబోధనతోపాటు సౌకర్యాలు కల్పించాలని కోరారు. పలువురు వార్డెన్లు మంత్రితో మాట్లాడుతూ ఆరు నెలలకు సంబంధించి ప్రొవిజన్ బకాయిలు ఉన్నాయని వాటిని ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాబీసీ వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్‌లు ధర్మవరం రాజకుళ్లాయప్ప, బాలాజీ, సుబ్బరాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులు ఇవేనా..?

- లీజుదారులను ప్రశ్నించిన సీఈసీ
- నేడు మైనింగ్ లీజుదారులతో సమావేశం

బళ్లారి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీ-కర్ణాటక సరిహద్దులో గనుల సరిహద్దులను గుర్తించేందుకు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ (సీఈసీ) చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో లీజుదారులతో కలిసి గురువారం బళ్లారి జిల్లా పరిధిలోని గనుల ప్రాంతంలో పర్యటించింది. ‘మీరు లీజ్ పొందిన ప్రాంతంలో అప్పట్లో ఉన్న సరిహద్దు రాళ్లు ఇవేనా..? అప్పుడు ఇప్పుడు ఇలాగే ఉన్నాయా.. లేదా..?’ అని లీజుదారులను సీఈసీ విచారించింది. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఏడు గనులను 1968లో కొందరు లీజుకు తీసుకున్నారు. బీఎంటీ, హెచ్‌టీ, ఎన్‌ఆర్, టీఎస్‌ఆర్, వీఎంపీసీ, ఎస్ఎంసీ, బీఎంసీ కంపెనీలు ఇక్కడ మైనింగ్ నిర్వహించేవి. ఇవన్నీ బళ్లారి జిల్లా భూభాగంలో ఉన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం కారణంగా గనుల తవ్వకాలను నిలిపేశారు. ప్రస్తుతం రాష్ట్రాల సరిహద్దుల గుర్తింపు విషయం జోలికి వెళ్లకుండా, కర్ణాటక భూభాగంలో ఉండే ఏడు గనులు సరిహద్దుల గుర్తింపునకు సీఈసీ సర్వే చేస్తోంది. నెల రోజుల క్రితం గనుల సరిహద్దుల పై సర్వే నిర్వహించింది. తాజాగా లీజుదారులను గనుల ప్రాంతంలోకి పిలిపించి.. గుర్తుల గురించి ఆరా తీసింది. సీఈసీకి నేతృత్వం వహిస్తున్న గోయల్‌తో పాటు కర్ణాటక, ఏపీ అటవీ శాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ, సర్వే లాండ్ రికార్డు శాఖ అధికారులు హాజరయ్యారు. కాగా, 1968లో ఇనుప గనులను రాష్ట్రాల సరిహద్దులో ఉండే గ్రామాల సరిహద్దుల ఆధారంగా మైనింగ్ లీజ్‌కు ఇచ్చారని లీజు దారులు అధికారులకు తెలిపారు. మైనింగ్ లీజ్ బౌండరీలు గుర్తించాలంటే రాష్ట్రాల సరిహద్దులు నిర్ధారణ కావాలని ఎన్.రత్నయ్య(ఎన్‌ఆర్), టీఎస్‌ఆర్ మైనింగ్ లీజుదారులు అధికారులకు వివరించారు. ఈ విషయంలో మరింత పురోగతి సాధించేందుకు మైనింగ్ లీజుదారులతో శుక్రవారం డోనిమలైలో సమావేశం నిర్వహించనున్నారు. సీఈసీ, రెండు రాష్ట్రాల అటవీశాఖ, గనుల శాఖ, రెవెన్యూ శాఖ, సర్వే లాండ్ రికార్డ్స్ అధికారులు సమావేశంలో పాల్గొంటారు. లీజు పొందిన ఏడు గనుల హక్కుదారులు రికార్డులతో హాజరు కావాలని సీఈసీ సూచించింది.



సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న అధికారుల బృందం

చీనీ, టమోటా ధరలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18,500, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలు పలికాయని మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 604 టన్నుల చీనీకాయలు వచ్చాయని అన్నారు.

- కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠ ధర రూ.35, సరాసరి రూ.29, కనిష్ఠ ధర రూ.22 పలికాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. 600 క్వింటాళ్ల టమోటా మార్కెట్‌కు వచ్చాయి.

నేమ్ బోర్డులు ఏవీ?

● ఉపాధి సిబ్బందిపై ఏపీఓ ఆగ్రహం



ప్రజావేదిక సదస్సులో మట్లాడుతున్న అధికారులు

శింగనమల, జూలై 4: మండలంలో ఉపాధి పనులు చేసిన చోట్ల నేమ్ బోర్డులు ఎందుకు పెట్టలేదని వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి.. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శింగనమల మండలంలో 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో రూ.8 కోట్ల పనులపై సామాజిక తనిఖీల తరువాత గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజావేదిక ఓపెన్ ఫోరం నిర్వహించారు. సామాజిక తనిఖీ ఆడిషనల్ పీడీతో పాటు విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంపీపీ యోగేశ్వరి హాజరయ్యారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పనులు చేసిన తరువాత ఎక్కడ చేశారు ఐడీ పనులకు ఎంత ఖర్చు పెట్టారని ఎక్కడా నేమ్ బోర్డులు లేవని మండిపడ్డారు. ఎక్కడా మస్టర్లు, ఎంబుక్‌లు చేయలేదన్నారు. మండలంలో రూ.8 కోట్ల పనులు జరిగితే సామాజిక తనిఖీలో కేవలం రూ.లక్షల్లో అవినీతి జరిగిందని, రికవరీకి అధికారులు ఆదేశించడం కొందను తవ్వి ఎలుకను పట్టినట్టు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈసీ దామోదర్, ఎస్‌ఆర్‌పీ పాల్గొన్నారు.

అన్ని వ్యవస్థలు ఒకే గొడుగు కిందకు తేవాలి

● మంత్రి లోకేశ్‌కు ఎస్టీఫీ అధ్యక్షుడి వినతి



మంత్రి లోకేశ్‌తో హరికృష్ణ

అనంతపురం విద్య, జూలై 4: విద్యారంగంలోని జిల్లాపరిషత్, మున్సిపల్, నగరపాలిక, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, సాంఘిక సంక్షేమం, గురుకుల పాఠశాలలన్నింటినీ ఒకే గొడుగు కింద తేవాలని ఎస్టీఫీ రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ మంత్రి లోకేశ్‌ను కోరారు. గురువారం ఆయన మంత్రిని విజయవాడలో కలిశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన అన్ని కేసులు ఎత్తివేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయడంతోపాటు, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ వర్తింపజేయాలని, చిన్న కారణాలు చూపి టీచర్లకు కోత పెట్టిన ఇంక్రిమెంట్లను పునరుద్ధరించాలని కోరారు. నేరుగా 12వ పీఆర్సీ ప్రకటించి, పీఆర్సీ ఫిట్‌మెంట్ 45 శాతం ప్రకటించాలని కోరారు. తల్లికి వందనం పథకం గవర్నమెంట్ స్కూళ్లలో చదివే పిల్లలకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన పాస్టర్లు



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పాస్టర్లు

అనంతపురంరూరల్, జూలై 4: జిల్లా పాస్టర్ల సంక్షేమ సంఘం సభ్యులు నగరంలో గురువారం ఎమ్మెల్యేలను కలిశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతలను నగరంలోని వారి గృహాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్ మార్క్, కార్యదర్శి జీఆర్ ఆనంద్, ఈసీ మెంబరు రూపస్‌కుమార్, పాస్టర్లు జాషువా జువాన్ పాల్గొన్నారు.

జేఎల్‌ఎం సస్పెన్షన్

అనంతపురంరూరల్, జూలై 4: నార్పల మండలంలోని పప్పూరుకు చెందిన జేఎల్‌ఎం నాగేంద్ర సస్పెండయ్యారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ అనంతపురం టౌన్ ఈఈ జేవీ రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల 20న కరెంట్ దొంగలు దొరికేరా..? అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్లు ఈఈ రమేష్ తెలిపారు. వారి నివేదిక ఆధారంగా పప్పూరు జేఎల్‌ఎం నాగేంద్రను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. నార్పల మండలంలో అనధికారంగా రైతుల పేర్లతో పెద్ద సంఖ్యలోనే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. తర్వాత రైతుల నుంచి వేల రూపాయలు విద్యుత్ ఉద్యోగులు తీసుకుని తమ జేబులు నింపుకున్నారు. ఈ విషయాలు సంబంధిత అధికారుల దృష్టికి వెళ్లడంతో ముగ్గురు నలుగురికి అధికారులు మెమోలతో సరిపెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే నకిలీ ఉద్యోగులు అనధికారంగా ఏర్పాటు చేసిన వాటిని అధికారుల సహకారంతో సక్రమం చేసుకున్నారన్న వాదనలు ఉన్నాయి.

పరిటాల సునీతను కలిసిన దండు

శింగనమల, జూలై 4: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం అనంతపురంలో పరిటాల సునీతను ఆయన కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్, కుల్లాయప్ప, బండి వరకుమార్, నారాయణస్వామి, ప్రకాశ్, గౌస్, రంగస్వామి ఉన్నారు.

భూఆక్రమణదారులను జిల్లా బహిష్కరణ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 4: వైసీపీ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా భూములను ఆక్రమించుకున్న భూబకాసురులను జిల్లా బహిష్కరణ చేయాలని సీపీఐ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి, అనంతపూర్ ట్రస్ట్ సభ్యులు లక్ష్మన్న డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లావ్యాప్తంగా పేదల భూములను దోచుకున్న వైసీపీ నాయకుల నుంచి వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేయాలన్నారు. రాప్తాడు సమీపంలో తనతోపాటు బాధితులు హరిప్రసాద్, సూర్యనారాయణ భూములను కబ్జాదారులు ఆక్రమించుకున్నారన్నారు. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి జిల్లా బహిష్కరించాలన్నారు. ఇప్పటికే పలుమార్లు బాధితులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు.

విజృంభిస్తున్న డయేరియా..!

● రోగులతో ఆస్పత్రులు ఫుల్..

శింగనమల, జూలై 4: మండలంలో డయేరియా విజృంభిస్తోంది. బాధితులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రికి పరుగులు పెడుతున్నారు. ప్రతి గ్రామంలో నుంచి శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డయేరియా బాధితులు రోజు రోజుకు పెరుగుతున్నారు. చాలా మంది బాధితులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. మండలంలోని గ్రామాల్లో వారం నుంచి ప్రతి రోజు ప్రభుత్వ ఆస్పత్రిలో 40 నుంచి 50 మంది వరకు బాధితులు చికిత్సకు వస్తున్నట్టుఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గురువారం శింగనమల, నసంకచెరువు, పెదవడ్లి, శివపురం, గురుగుంట్ల తదితర గ్రామాల నుంచి బాధితులు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం
- వైద్యాధికారి శంకర్ నాయక్

గ్రామాల్లో డయేరియాపై అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధి సోకిన వారు భయపడే అవసరం లేదు. దార్లల్ల సలహా మేరకు మందులు వాడాలి. వ్యాధి వచ్చిన వారు ఓఆర్ఎస్, కొబ్బరినీళ్లు తాగడం మంచిది. వాతవరణ కాలుష్యం వల్లనే ఈ వ్యాధి వస్తుంది.



శింగనమల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

డంపింగ్‌యార్డులో అవినీతికి అధికారులు బాధ్యత వహించాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్రైం, జూలై 4: నగరపాలిక పరిధిలోని డంపింగ్‌యార్డులో జరిగిన అవినీతి వ్యవహారంలో అధికారులదే తప్పని తేలితే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం నగర మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. అడిషనల్ కమిషనర్ రెవెన్యూ విభాగానికి సంబంధించి ఆదాయం, పన్ను వసూళ్ల వివరాలు తెలిపారు. వివిధ విభాగాల అంశాలపై సమీక్షించారు. టౌన్‌ప్లానింగ్ విభాగం విషయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఆక్రమణలను ఖాళీ చేయించే విషయం ఏం చేశారని ప్రశ్నించారు. స్మరణ సంస్థకు సంబంధించి రోడ్డును ఆక్రమించి నిర్మిస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించగా సమాధానం చెప్పలేక ఏసీపీ హరప్రసాద్ నీళ్లు నమిలారు. సెంట్రల్‌పార్క్‌లోనూ ఆక్రమణలున్నాయనే ఫిర్యాదులందాయన్నారు. మేయర్ మాట్లాడుతూ.. అనధికార హోర్డింగులను తీసేశారా అని ప్రశ్నించగా ఏసీపీ ఇంకా తీయలేదని, త్వరలోనే తీస్తామని చెప్పుకొచ్చారు. అనంతరం చెత్త సేకరణపై వాహనాలు ఎన్నున్నాయని, ఎన్ని ఆనసరమవుతాయని ఎమ్మెల్యే ఆరా తీశారు. ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి సమాధానమిస్తూ కొన్ని వాహనాలు మరమ్మతుకు గురయ్యాయని, రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు లేకపోవడమే సమస్యగా మారిందన్నారు. మేయర్ మాట్లాడుతూ... డంపింగ్‌యార్డుపై ఆరోపణలున్నాయని వాటిపై విచారణ చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. పెండింగ్ బిల్లులు పూర్తి చేయించాలని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.25,516 విరాళం



విరాళాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీతకు అందజేస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్, జూలై 4: అమరావతి రాజధాని నిర్మాణానికి పింఛన్ దారులు ఇచ్చిన విరాళాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీతకు మండల నాయకులు అందజేశారు. మండలంలోని పాపంపేట పంచాయతీ ఓంనగర్, ఆంజనేయ నగర్‌కు చెందిన పింఛనీదారులు రూ.20,516, పాపంపేటకు చెందిన మరికొందరు రూ.5వేలు విరాళంగా ఇచ్చారు. లబ్ధిదారులు ఇచ్చిన మొత్తం సొమ్మును రూ.25,516 జిల్లా కేంద్రంలోని అరవిందనగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతకు అందజేశారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, సత్యసాయి జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి బాబావలి, మహిళా నాయకులు లక్ష్మీదేవి, రామాంజినమ్మ పాల్గొన్నారు.

విజయసాయికి డొక్కా సీతమ్మ స్ఫూర్తి అవార్డు

అనంతపురం కల్చరల్, జూలై 4: సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ డొక్కా సీతమ్మ స్ఫూర్తి అవార్డును అందుకున్నారు. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మ 184వ జయంతిని పురస్కరించుకుని గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్, అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక, పింఛర్‌బోక్ సొసైటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ తెలుగురాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని డొక్కా సీతమ్మ స్ఫూర్తి అవార్డుకు ఎంపిక చేశారు. అందులో భాగంగా స్వచ్ఛంద సేవా సంస్థ విభాగంలో అనంతపురం జిల్లా తరపున ఎంపికైన సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్‌కు గురువారం కొరియర్‌ద్వారా అవార్డును పంపారు. ఈ అవార్డును అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ చేతులమీదుగా విజయసాయికుమార్‌కు అందజేసి సత్కరించారు.

కొనసాగుతున్న ఆంధ్రా క్రికెట్ సౌత్‌జోన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 4: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 మహిళల క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో పోటీలు నిర్వహించారు. రెస్టాఫ్ నార్త్ జోన్, కృష్ణ జట్ల మధ్య జరిగిన పోటీలో నార్త్‌జోన్ నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 175పరుగులు చేసింది. దివ్యశ్రీ 52పరుగులు చేసింది. కృష్ణ బౌలర్ ఇషికామయుబాయి 4వికెట్లు తీసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణా జట్టు 46.4ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 176పరుగులు సాధించింది. తరుణిజోషి 3వికెట్లు తీసింది. విజిట్ తేడాతో కృష్ణా జట్టు గెలుపొందింది. అనంతపురం, విశాఖపట్నం జట్లు తలపడగా విశాఖపట్నం 50 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 242 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం..50ఓవర్లలో 8వికెట్లు నష్టానికి 177పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. మరోమ్యాచ్‌లో సెంట్రల్ జోన్, సౌత్‌జోన్ జట్లు తలపడగా సెంట్రల్‌జోన్ 272 పరుగులు సాధించింది. హేమసాయి రమ్య 80పరుగులు రిపీ 64పరుగులు చేశారు. అనంతరం బరిలోకిదిగిన సౌత్‌జోన్ 50ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 152పరుగులు మాత్రమే చేసింది. 120పరుగుల తేడాతో సెంట్రల్ జట్టు విజయం సాధించింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ లాక్రోస్ పోటీల్లో రాధిక ప్రతిభ



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 4: అంతర్జాతీయ స్థాయి లాక్రోస్ క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన రాధిక ప్రతిభ చాటింది. నాలుగు రోజులుగా ఉజ్బెకిస్థాన్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ లాక్రోస్ క్రీడా పోటీల్లో రాధిక భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. గురువారం ఫైనల్‌లో సౌదీఅరేబియా, భారత జట్టు తలపడ్డాయి. ఇందులో భారత్ రన్నరప్‌గా నిలిచింది. జిల్లాకు చెందిన రాధిక కీపింగ్‌లో మెరుగైన ప్రతిభ చాటి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది. ఉత్తమ ప్రతిభతో ఆకట్టుకున్న రాధికను పలువురు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో సాయి భిక్షాటన



కోలాటమాడుతున్న మహిళలు

అనంతపురం కల్చరల్, జూలై 4: గురుపౌర్ణమిని పురస్కరించుకుని నగరానికి చెందిన షిర్డీసాయిబాబా సేవాసంఘం ఆధ్వర్యంలో గురువారం సాయి భిక్షాటనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో సాయినాథుని ఉత్సవమూర్తిని ఆసీనులు గావించి వేణుగోపాలనగర్ నుంచి పాతూరు, గాంధీబజార్, సప్తగిరి సర్కిల్, క్లాక్‌టవర్, ఆర్ఎఫ్ రోడ్డు మీదుగా శ్రీకంఠం సర్కిల్ వరకు ఊరేగించారు. ఊరేగింపు సమయంలో భక్తులు భిక్షాటన చేస్తుండగా మరోవైపు ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వేదకొండ కౌసల్య బృందం భక్తిపాటలకు కోలాటమాడుతూ భక్తులను అలరించారు. షిర్డీసాయిబాబా అన్నదాన సేవాసంఘం అధ్యక్షుడు నేమాన్ ప్రసాద్, విజయలక్ష్మి, ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అందరికీ ఒకే న్యాయం హర్షణీయం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్



అనంతపురం విద్య, జూలై 4: కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వంలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల కుటుంబీకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతుంటే.. సీఎం చంద్రబాబు వారిపై ఆక్షింతలు వేయడం హర్షణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జగదీష్ అన్నారు. గురువారం ఆయన ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధులకు రూ.4 వేలకు పింఛన్ పెంచడంతోపాటు, ఇతర వర్గాలకు పింఛన్లు పెంచడం అభినందనీయమన్నారు. లాగే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేయడం, ఉచిత ఇసుకను తీసుకొస్తుండటం ప్రశంసనీయమన్నారు.

గూగూడులో మౌలిక సదుపాయాలు కల్పించండి

● కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం/శింగనమల, జూలై 4: రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన గూగూడు బ్రహ్మోత్సవాలలో భక్తులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. గురువారం అనంతపురంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం గూగూడు బ్రహ్మోత్సవాలకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అభివృద్ధి పనులు చేపట్టి విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సోషల్ మీడియా అసోసియేషన్
రాష్ట్ర అధ్యక్షుడిగా షకీల్ షఫీ



అనంతపురం కల్చరల్, జూలై 4: ఏపీ సోషల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన కేఎం షకీల్ షఫీ ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలోని ఓ కల్యాణమండపంలో ఎన్నికలు నిర్వహించారు. షకీల్ షఫీతోపాటు నరసింగరావు, సుధీర్ రెడ్డి ఎన్నికల్లో పోటీ చేశారు. పోలింగ్ లో నరసింగరావుకు 366 ఓట్లు, సుధీర్‌రెడ్డి 270 ఓట్లు సాధించగా షకీల్ షఫీ అత్యధికంగా 2817 ఓట్లతో రాష్ట్ర అధ్యక్షుడిగా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాస్ వెల్లడించారు.

కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా సాగాలి

అనంతపురం సెంట్రల్, జూలై 4: ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ అధికారులకు సూచించారు. జేఎన్‌టీయూలో ఏర్పాటుచేసిన కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ నమోదు, సర్టిఫికెట్స్ అప్‌లోడ్ తదితర అంశాల్లో విద్యార్థులు తడబాటుకు గురవుతారన్నారు. సరైన పద్ధతిలో నమోదు చేసుకొనేలా సలహాలు, సూచనలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కిరణ్మయి, ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నల్లమ్మ ఆలయ హుండీ చోరీ

గార్లదిన్నె, జూలై 4: మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో వెలసిన నల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి హుండీని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం భక్తులు ఆలయానికి వెళ్లి చూడగా హుండీ లేకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గౌస్‌బాషా, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలో ఏ వస్తువులు చోరీకి గురయ్యాయని ఎస్‌ఐ గ్రామస్థులను అడిగారు. హుండీలో రూ. 10వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్సిటీల్లో సంపూర్ణ బంద్

అనంతపురం సెంట్రల్, జూలై 4: నీట్‌లో జరిగిన అక్రమాలను అరికట్టాలని విద్యార్థి సంఘాలు గురువారం చేపట్టిన బంద్ వర్సిటీల్లో సంపూర్ణంగా జరిగింది. జేఎన్‌టీయూ, ఎస్కేయూలో విద్యార్థి సంఘాల నాయకులు నిరసన తెలియజేసి బంద్ చేపట్టారు. నాయకులు వేమన, బాలకృష్ణ పాల్గొన్నారు.

శింగనమల: నీట్ స్కాంకు వ్యతిరేకంగా తలపెట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైనట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గురువారం మండలంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. నీట్ స్కాంపై విచారణ చేపట్టాలన్నారు.

చిరుద్యోగులపై వేధింపులు ఆపాలి

అనంతపురం కల్చరల్, జూలై 4: జిల్లాలోని వివిధ మండలాల్లో మధ్యాహ్న భోజన, ఆశ, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు, శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయ్ కార్మికులపై అధికారపార్టీకి చెందిన స్థానిక నాయకుల వేధింపులు ఆపాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాయకుల వేధింపులతో వజ్రకరూరు మండలం రాగులపాడు గ్రామంలో భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సుంకమ్మ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని, ఆమెను గుంతకల్లు ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతోందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వేధింపులు పెరుగుతున్నాయని, వీటిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు చొరవ చూపి నివారించాలని కోరారు.

ప్రజలకు శుద్ధ జలం సరఫరా చేయండి

● సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి

అనంతపురం కల్చరల్, జూలై 4: నగరంలో శుద్ధ నీటిని సరఫరా చేసి, ప్రజలను డయేరియా నుంచి కాపాడాలని సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించారు. రామిరెడ్డి మాట్లాడుతూ నగరంలో సరఫరా అవుతున్న మంచినీటి పైప్‌లైన్ లీక్ అయి మురుగునీరు కలుస్తోందని, ఆ నీరు తాగడంవల్ల వాంతులు, విరేచనాలవుతున్నాయని తెలిపారు. దీని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. మున్సిపల్ అధికారులు ఎక్కడా కలుషిత నీటిని పరిశీలించిన పాపాన పోలేదని తెలిపారు. నగరపాలక హెల్త్ ఆఫీసర్లు ఎక్కడ మంచినీరు కలుషితమైనాయో కనిపెట్టలేకపోతున్నారన్నారు. ప్యూరిఫైడ్ వాటర్ అంటూ వాటర్‌ప్లాంట్ల దగ్గర ప్రజలు తెచ్చుకునే నీరు కూడా కలుషితమై అనారోగ్యం బారిన పడుతున్నారని, అయినా నగరపాలక అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ప్రజలకు శుద్ధినీటిని సరఫరా చేసి డయేరియా నుంచి కాపాడాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు వెంకటనారాయణ, బాలకృష్ణ, మహేశ్, వెంకటేశు, నూరుల్లా, ఆటో యూనియన్ శివ, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



మేయర్ వసీంకు సమస్యలు వివరిస్తున్న సీపీఎం నాయకులు

రోశయ్యకు ఆర్యవైశ్యుల నివాళి



రోశయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కొత్తపూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 4: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్యులు నివాళులర్పించారు. గురువారం సాయంత్రం కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గుల్జార్‌పేటలోని వాసవీ కల్యాణమండపంలో ఆ సంఘం అధ్యక్షుడు గోపాలమ్మ నరసింహులు చేతులమీదుగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పాతూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు మిట్టా అంజినేయులు, సూర్యప్రకాశ్, టంగుటూరు నాగభూషణ, జయం సురేష్, క్రిష్ణం రమణ, సృజన్‌కుమార్, పాతూరు సంఘం అధ్యక్షుడు విన్ని నాగరత్నం, తిరుపతుల జగదీష్‌కుమార్, సిరిగుప్ప వెంకటేష్, గర్లాల నాగరాజు, చల్లా కృష్ణంగయ్య పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహం వద్ద పాతూరు ఆర్యవైశ్య నాయకులు

ఘనంగా వంగవీటి రంగా జయంతి



వంగవీటి రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, జూలై 4: వంగవీటి రంగా జయంతి వేడుకలను టీడీపీ, జనసేన, రాయలసీమ బలిజ మహాసంఘంనాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం నగరపాలక సంస్థ ఎదురుగా వంగవీటి రంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూలమాలలతో అలంకరించి, టెంకాయలు కొట్టి నివాళులర్పించారు. వంగవీటి రంగ ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నేతలు అన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జనసేన కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ బలిజ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు తొండపునాటి శంకరయ్య, గౌరవాధ్యక్షుడు పామురాయి వెంకటేష్, రవిశంకర్ రమణ, బీజేపీ లలితకుమార్, టీడీపీ ఆదెన్న, ఆదినారాయణ, దండు శ్రీనివాసులు, సుధాకర్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

అల్లూరి తరహాలో ప్రతి కార్యకర్త పోరాడాలి

అనంతపురం అర్బన్: బ్రిటీష్ వారిపై మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాటం చేసిన తరహాలోనే గత వైసీపీ అరాచక పాలనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోరాడి సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కారణమయ్యారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు బుగ్గయ్య చౌదరి, తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, నెట్టెం బాలకృష్ణ, దేగల కృష్ణమూర్తి, తాజుద్దీన్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయాన్ని నీటిపారుదల శాఖకు అప్పగించాలి

అనంతపురం అర్బన్, జూలై 4: హెచ్చెల్సీ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని ప్రభుత్వం స్వాధీనంచేసుకుని తుంగభద్ర ఎగువ కాలువ సర్కిల్ కార్యాలయానికి అప్పగించాలని ఏపీఎన్‌జీవో సంఘం నగర శాఖ నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కోరారు. గురువారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను సంఘం నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ బాబు, ఇతర నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. హెచ్చెల్సీ కాలనీలోని పాత నాలుగు ఐరుకులుగల్లో తుంగభద్ర ఎగువ కాలువ సర్కిల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది విధుల నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● ఎస్‌ఈలకు సచివాలయ ఇంజనీర్ల వినతి



ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఇంజనీర్లు

అనంతపురం, సిటీ, జూలై4: జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మైలారప్ప, సెక్రటరీ రాఘవనాయుడు, ట్రెజరర్ వీరేష్, డి నాయుడ్ కోరారు. ఈ మేరకు ఆయా ఇంజనీరింగ్ శాఖల ఎస్‌ఈలను కలిసి స్థానిక పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ కేవీకేవీ ప్రసాద్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈలను కలిసి గురువా రం తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారందరూ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖలకు విలీనం చేసే విధంగా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. ఆయా అధికారులు కేటాయించడంతో తమకు పదోన్నతితో పాటు ఉద్యోగ భద్రత కలుగుతుందని గుర్తుచేశారు. దీంతో ఆయా ఎస్‌ఈలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

ఓ రోడ్డు ప్రమాదం.. ఆత్మహత్య..!

● సెల్‌ఫోన్ స్టేషన్‌లో పెట్టుకున్న పోలీసులు
● వీఆర్‌కు కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐ

అనంతపురం క్రైం, జూలై 4: కేసు లేదు.. పైసా వసూల్ లేదు.. చిన్న తప్పిదం ముగ్గురు పోలీస్ సిబ్బందిని వీఆర్‌కు పంపింది. రెండురోజుల క్రితం చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు వైపులా ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈక్రమంలో ఇద్దరూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కేసు వద్దని రాజీ చేసుకుంటామని చెప్పుకున్నారు. అదే క్రమంలో గాయపడిన వారు ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఫోన్‌ను ఉంచుకోవాలని, డబ్బు మాట్లాడుకుందామని పోలీసులను కోరారు. దీంతో ఆ సెల్‌ఫోన్‌ను ఉంచుకున్నారు. ఆ ఫోన్‌పాటు ముగ్గురు పోలీసులను వీఆర్‌కు పంపేలా చేసింది. గతనెల 27న అనంతపురం రూరల్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆజాద్‌నగర్‌కు చెందిన అబ్బుల్లా, బెళుగుప్పకు చెందిన చంద్రానాయక్ బైకులు ఢీకొన్నాయి. ప్రమాదానికి కారణమైన అబ్బుల్లా మద్యం తాగి ఉన్నాడు. అనంతరం రూరల్ పోలీసుల దృష్టికి ఈ విషయం తెలియడంతో గాయపడిన చంద్రానాయక్, యాక్సిడెంట్ చేసిన అబ్బుల్లా ఇద్దరూ అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. గాయపడిన వ్యక్తి నాన్ ఎమ్మెల్సీ కింద కేసు నమోదు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయడానికి లేదని సెబుతున్నారు. ఆ ఇద్దరు ప్రమాదానికి కారణమైన బైకును స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారిద్దరు ఓ ఒప్పందంతో అబ్బుల్లా సెల్‌ఫోన్ పోలీసులకిచ్చారు. ఈ విషయం అబ్బుల్లా కుటుంబసభ్యులకు తెలిసి.. నువ్వు ఎక్కువుద్ధతో తాగి రోడ్డు యాక్సిడెంట్ చేస్తే.. ఆ డబ్బు తామెందుకు చెల్లించాలని నిలదీశారు. మనస్తాపం చెందిన అబ్బుల్లా 29వ తేదీన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై వర్సిటీ సమ్మెడు.. ఆనిపోయిన వ్యక్తిని పోలీసులు డబ్బులు అడిగారని సోషల్ మీడియాలో పోస్టులొచ్చాయి. ఆ వీడియో పోలీస్ ఉన్నతాధికారులకు చేరింది. వారు ఆరాతీయడంతో సెల్‌ఫోన్ స్టేషన్‌లో పెట్టుకున్నట్లు తేలింది. ఎస్పీ గౌతమిశాలి సీరియస్ అయ్యారు. ఏఎస్ఐ విజయ్ కుమార్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్ అరవింద్‌ను వీఆర్‌కు పంపుతూ రెండురోజుల క్రితం ఆదేశాలిచ్చారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

పుట్లూరు, జూలై 4: మండలంలోని చింతకుంట గ్రామంలో చేపడుతున్న కాళభైరవస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులను దేవాదాయశాఖ ఏఈ హరిత గురువారం పరిశీలించారు. సుమారు కోటిరూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ నిర్మాణ పనులను వీలైనంతవరకు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఆమె వెంట దేవాదాయశాఖ సిబ్బంది ఉన్నారు.

బోగస్ పింఛన్లను తొలగించండి

యాడికి, జూలై 4: మండలంలోని వెంగన్నపల్లి గ్రామ పంచాయతీలో తప్పుడు ధృవీకరణ పత్రాలతో చాలామంది పింఛన్లు పొందుతున్నారని, వారందరినీ గుర్తించి తొలగించాలని కోరుతూ సర్పంచు పార్వతమ్మ, ఉప సర్పంచు నాగమునిరెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంగన్నపల్లి పంచాయతీలో మొత్తం 20మంది తప్పుడు ధృవీకరణపత్రాలతో పెన్షన్ పొందుతున్నారని తెలిపారు. వాటిని తొలగించాలని కోరారు.

'పిల్లలను బడికి పంపండి'

యల్లనూరు, జూలై 4: పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గొడ్డుమర్రి గ్రామంలో 10వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేదని తెలిసి గురువారం ఆయన వారి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, పిల్లలను బడికి పంపాలని కోరారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట తిమ్మంపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ, జూలై 4: వజ్రకరూరు మండలం చాయాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన మధ్యాహ్నభోజనం పథకం నిర్వాహకురాలు సుంకమ్మ గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఆమెను సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఎండీఎం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ పరామర్శించారు.

మహాజాతరకు తరలిరండి

కూడేరు, జూలై 4: ప్రకాశం జిల్లా ఈదుముడు గ్రామంలో ఈనెల 7వ తేదీన జరిగే మాదిగల మహా జాతరకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు లక్ష్మన్న పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాజాతరలో మాదిగల ప్రగతి, భవిష్యత్తు కార్యాచరణపై తదితర అంశాలపై చర్చిస్తారని, కనుక ప్రతి మాదిగ తరలిరావాలని కోరారు.

రాజీనామా..

ఉరవకొండ, జూలై 4: వైసీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి పదవికి వడ్ల సలీం గురువారం రాజీనామా చేశారు. ఆ రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడికి పంపుతున్నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఇన్‌చార్జిగా సతీష్

ఉరవకొండ, జూలై 4: విడపనకల్లు కోఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జిగా సీనియర్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. సొసైటీ కమిటీలు రద్దు కావడంతో ఆయనను ఇన్‌చార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణాల మంజూరుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటి పక్క స్థలం పరిశీలన

తాడిపత్రి, జూలై 4: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి పక్కనున్న స్థలాన్ని మున్సిపల్ అధికారులు గురువారం పరిశీలించారు. కొద్దిరోజులక్రితం మున్సిపల్ అధికారులకు టీడీపీ కౌన్సిలర్లు ఆ స్థలం మున్సిపాలిటీకి చెందినదని ఫిర్యాదు చేయడంతో గురువారం వారు పరిశీలించారు.

తండ్రీకూతురు అదృశ్యం

పుట్లూరు, జూలై 4: మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన శివశంకర్, ఆయన 11ఏళ్ల కుమార్తె ప్రశాంతి అదృశ్యమయ్యారని గురువారం ఎస్ఐ హేమాద్రి తెలిపారు. శివశంకర్ భార్య స్వాతితో గొడవపడి గతనెల 20వ తేదీన కుమార్తెను తీసుకొని ఇంటిలో నుంచి వెళ్లిపోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

బెళుగుప్ప, జూలై 4 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకు చెందిన రాములమ్మ రెండు రోజుల నుంచి కనిపించడం లేదంటూ ఆమె కుమారుడు శ్రీకాంత్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను పనినిమిత్తం అనంతపురం వెళ్లానని, ఇంటికి వచ్చి చూడగా అమ్మ కనిపించలేదని, బంధువులు గ్రామాల్లో విచారించినా ఆచూకీ దొరకలేదని, దీంతో తమకు పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన చెప్పారు. కుటుంబ సభ్యులతో గొడవపడి ఇల్లు వదిలి వెళ్లినట్లు కాలనీవాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి, జూలై 4: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున సెబ్ పోలీసులు పట్టుకున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కట్టకిందపల్లి వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా అధికలోడుతో వెళ్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారన్నారు. అనంతరం వాటిని పామిడి పోలీసు స్టేషన్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యల్లనూరు: మండలంలోని చిత్రావతినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. శింగవరం సమీపంలోని నదినుంచి తిమ్మంపల్లి మీదుగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి పట్టుకున్నామన్నారు. అనంతరం వాటిని స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

ఎమ్మెల్యే అమిలినేనికి సన్మానం

ఉరవకొండ, జూలై 4: కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబును ఉరవకొండకు చెందిన టీడీపీ నాయకులు భీమన్న, నెట్టికంటయ్య, కుమారస్వామి, హనుమంత రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కల్యాణదుర్గంలో గురువారం ఆయన్ను కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు.



ఎమ్మెల్యేతో టీడీపీ నాయకులు

విజృంభిస్తున్న డయేరియా

● రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

తాడిపత్రి, జూలై 4: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల్లో ఒకటైన డయేరియా పట్టణంతోపాటు మండలంలో కూడా విజృంభిస్తోంది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ముప్పుగా తయారవుతోంది. డయేరియా బారిన పడ్డ రోగులు డబ్బులు ఉంటే ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. డబ్బులు లేని నిరుపేదలు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. ప్రతిరోజూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మొదట 10లోపు ఉన్న ఈ సంఖ్య రానురాను 40కి చేరింది. వీరిలో 20 మందికి పైగా అడ్మిట్ అయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఒక్కొక్క మంచంలో ఇద్దరికి చొప్పున వైద్యం అందిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారికి సరైన మందులు లేకపోవడంతో బహిరంగ మార్కెట్‌కు వెళ్లి మందులు తెచ్చుకోవాలని వైద్యసిబ్బంది రోగుల బంధువులకు సలహాలు ఇస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. డయేరియా విజృంభించడంపై వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా వైద్య సిబ్బంది వాడవాడలా తిరిగి ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరవకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 15 మంది డయేరియాతో చికిత్స పొందుతున్నారు. ఉరవకొండ, షేక్షానుపల్లి, వెంకటాంపల్లి, వజ్రకరూరు, కడమలకుంటకు చెందిన వారు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు. గత రెండ్రోజుల వ్యవధిలో 15 మంది ఆసుపత్రిలో చేరారు. గ్రామాల్లో కలిషితనీరు కారణంగా డయేరియా కేసులు నమోదవుతున్నాయి.

గుంతకల్లుటౌన్: అతిసార వ్యాధితో ప్రజలు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి క్యూ కడుతున్నారు. పట్టణంతో పాటు మండలంలోని ప్రజలు గత నాలుగు రోజుల నుంచి వాంతులు విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో అడ్మిట్ అవుతున్నారు. గత సోమవారం నుంచి గురువారం వరకు 42 మంది డయేరియాతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

బెళుగుప్ప: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంకంపల్లి, నక్కలపల్లికి చెందిన నలుగురు మహిళలు వాంతులు, కడుపునొప్పితో చికిత్స పొందుతున్నారు. వారు డయేరియా లక్షణాలతో బాధపడుతున్నట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.



తాడిపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు



గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో..



ఉరవకొండ ఆసుపత్రిలో..

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి, జూలై 4: గుంతకల్లు నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన గ్రామాల వారీగా పార్టీ శ్రేణులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, అత్యవసర అభివృద్ధిపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు యానిమేటర్ల నియామకంపై స్థానిక నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, విభిన్న ప్రతిభా వంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, నాయకులు ఆర్‌ఆర్ రమేష్, జింకల సంజీవకుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, బొమ్మా మోహన్ కృష్ణ, ముసలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతి

పామిడి: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్-257 రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, సతీష్ కుమార్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఫెడరేషన్ మండల గౌరవాధ్యక్షుడు ఉజ్జినప్ప, అధ్యక్షుడు నూర్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గ్రామాలను అభివృద్ధి చేస్తాం

గుత్తిరూరల్: మండలంలోని బాచుపల్లిలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంటును ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎంకే చౌదరి, లక్ష్మణ్‌రావు, వెంకటరాముడు, నరసింహులు, సర్పంచు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలవను కలిసిన వైసీపీ కౌన్సిలర్లు

● చైర్మన్ మార్పు దిశగా పావులు

రాయదుర్గం, జూలై 4: వైసీపీలో కలకలం మొదలైంది. అసంతృప్తిగా ఉన్న 15 మంది కౌన్సిలర్లు గురువారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును కలిశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో వైస్‌చైర్మన్ శ్రీనివాసులు, కౌన్సిలర్లు దేవరాజు, సంజీవ, ఫక్రుద్దీన్, మంజు, షబ్బీర్‌తో పాటు మరో తొమ్మిదిమంది కలిసి ఎమ్మెల్యేకు పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూడేళ్లకాలంలో వార్డుల్లో అభివృద్ధి కుంటుపడిందని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే కాలవ సానుకూలంగా స్పందించారు.

వేడెక్కిన రాజకీయం..

అధికశాతం కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ శిల్పపై అసంతృప్తితో ఉన్నట్లు కనిపిస్తోంది. ఆమెను కుర్చీ నుంచి దించేందుకు వైసీపీ నాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా కౌన్సిలర్లలో మెజార్టీ సభ్యులు టీడీపీ వైపు చూస్తున్నారని తెలుస్తోంది. మున్సిపాలిటీలో 32 మంది కౌన్సిలర్లు ఉండగా.. అందులో ఇద్దరు మాత్రమే టీడీపీ వారు. ఎన్నికలకు ముందు ఒక కౌన్సిలర్ టీడీపీలోకి చేరారు. మిగిలిన 29 మందిలో 15 మంది చైర్‌పర్సన్‌పై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా కాలవ శ్రీనివాసులును కలవడంతో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. వారు టీడీపీలో చేరుతారా.. లేక చైర్మన్ మార్పు కోరుతారా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. మున్సిపల్ ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా 6వ తేదీన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.



ఎమ్మెల్యే కాలవతో వైసీపీ కౌన్సిలర్లు

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

గుంతకల్లుటౌన్, జూలై 4: స్వాతంత్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి జరిపిన పోరాటం ఒక ప్రత్యేక అధ్యాయం అన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడ గడలాడించిన విప్లవ యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, ఆర్వో నాసిర్‌హుసేన్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని ఆసుపత్రిపాలెం సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులు అల్లూరి వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో వడ్లపాలెం, ఆసుపత్రి పాలెం-1, 2, కాల్వగడ్డ వీధి 1, 2, విజయనగర్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి జయరాములు, పాఠకులు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు.



తాడిపత్రిలోని ఓ అంగన్‌వాడీలో నివాళులర్పిస్తున్న వర్కర్లు, ఆయాలు

యాడికి: మండలకేంద్రంతో పాటు రాయలచెరువు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి వేషధారణలో పలువురు చిన్నారులు ఆకట్టుకున్నారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆయన త్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పురుగు మందుల వినియోగం తగ్గించాలి

గుత్తి, జూలై 4: రైతులు పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించాలని డిజిటల్ గ్రీన్ సంస్థ నిర్వాహకురాలు యశోద, ఉద్యాన అధికారిణి మిత్ర సూచించారు. పట్టణంలోని డీడబ్ల్యూఎంఏ కార్యాలయంలో గురువారం వారు గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరుకు చెందిన మిరప రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. న్యూట్రీషియన్, మేనేజ్‌మెంట్, ప్రొటోకాల్ పాటిస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. పురుగుమందుల వాడకం తగ్గించాలని సూచించారు. ఉద్యానశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ విద్యార్థి సంఘాలు గురువారం నిర్వహించిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ తదితర విద్యార్థి సంఘాల వారు అన్ని నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లోని అన్ని విద్యాసంస్థలను ఉదయమే బంద్ చేయించారు. అనంతరం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. పలువురు మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయన్నారు. ఈ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ పరీక్షను రాష్ట్రాలే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. బంద్‌లో కరీం, వినోద్, ఓబులేసు, రాకేష్, పవన్, మహేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు. ఈ బంద్‌కు పలుచోట్ల సీపీఎం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు మద్దతు పలికారు.



రాయదుర్గంలో విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



గుత్తిలో పాఠశాల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన



కుందుర్పిలో పాఠశాలను మూసివేయిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

టీడీపీలోకి వైసీపీ జడ్పీటీసీ సభ్యురాలు

కళ్యాణదుర్గం, జూలై 4: బ్రహ్మసముద్రం జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతమ్మ వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ లోకి చేరారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో చేరారు. ఎమ్మెల్యే ఆమెకు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను జెడ్పీటీసీగా ఎన్నికై 33 నెలలు గడిచినా మండలంలో ఒక్కరోడ్డు వేయించలేకపోయానని, మొన్నటిదాకా మంత్రిగా ఉషశ్రీచరణ్ వుండి కూడా ఉపయోగం లేదని వాపోయారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని, 114 చెరువులకు నీరు ఇవ్వగలరన్న నమ్మకంతోనే టీడీపీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైపీ రమేష్, పాలబండ్ల శ్రీరాములు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

బసవేశ్వరుడి విగ్రహం ఆవిష్కరణ

కళ్యాణదుర్గం: పట్టణంలోని బళ్లారి రోడ్డులో గల కాలనీకు బసవేశ్వర నగర్‌గా నామకరణం చేసి అక్కడే వున్న ఆర్చ్ వద్ద జగద్గురు బసవేశ్వర విగ్రహాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేసి చూపుతానన్నారు. గతంలో జరిగిన అభివృద్ధికన్నా మరింత ఎక్కువ అభివృద్ధి చేసి మన్ననలు పొందుతానన్నారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన యువకుడు గిరీష్ స్వర్ణకారుడిగా పని చేసేవారు. కాగా అతడు కొద్దిరోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఎన్నికలకు ముందు అతడిని కలిసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు గురువారం రూ. 3లక్షల ఆర్థిక సాయం చేశారు. స్థానిక ప్రజావేదిక వద్ద ఆ నగదును గిరీష్ తండ్రికి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆ యువకుడి చికిత్స నిమిత్తం ఈ నగదు అందజేసినట్లు తెలిపారు. తర్వాత గిరీష్‌తో ఎమ్మెల్యే వీడియోకాల్‌లో మాట్లాడి ఆరోగ్యం బాగా చూసుకోవాలని, జాగ్రత్తగా వుండాలని సూచించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

యాడికి, జూలై 4: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణం, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం బీజేపీ నాయకులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చౌడయ్య, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి

గుత్తి, జూలై 4: ప్రజలకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని డీఎస్ఓ శోభారాణి సూచించారు. పట్టణంలోని గుంతకల్లురోడ్డు తదితర వార్డులలో గురువారం ఎండీయూ వాహనాల ద్వారా చేపట్టిన రేషన్ సరుకుల పంపిణీని డీఎస్ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తూకాలను పరిశీలించారు. లబ్ధిదారులందరికీ రేషన్ సరిగా అందేలా చూడాలని సీఎస్‌డీటీ సూర్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్ఓ సిబ్బంది ప్రశాంత్, వీఆర్ఏ బాలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బ్రహ్మసముద్రం, జూలై 4 : మండలకేంద్రంలో గురువారం వైద్యాధికారి రాజేష్‌కుమార్.. సిబ్బందితో కలిసి పర్యటించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం డయేరియా కేసులు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిశుభ్రత, కలుషిత నీటి వల్ల డయేరియా వ్యాప్తి చెందుతోందన్నారు. కనుక ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వంట పాత్రలపై మూతలు పెట్టుకోవాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు. పీహెచ్‌సీ మేరీ, హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు..

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరిక్రాస్‌లో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ డయేరియాపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో పరిశుభ్రత పాటించాలని, చేతులు శుభ్రంగా కడుక్కుని భోజనం చేయాలని సూచించారు. ఈగలు వాలిన ఆహారపదార్థాలను తీసుకోకూడదన్నారు. తర్వాత ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. అనంతరం అందరూ కలిసి గ్రామంలో డయేరియాపై అవగాన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం రామలింగదేవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్పీ సీఈఓ

గుమ్మఘట్ట, జూలై 4: మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర హాస్టల్‌ను జడ్పీ సీఈఓ వైకోం నిదియాదేవి గురువారం సాయంత్రం తని ఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి మరుగుదొడ్లను పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్లుగా అద్దె భవనంలో అసౌకర్యాల నడుమ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక ప్రజలు ఆమెకు ఫిర్యాదు చేశారు. తర్వాత ఆమె స్థానికంగా మరో అదనపు గదిని పరిశీలించి విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని వార్డెన్ అరుణను ఆదేశించారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట సర్పంచ్ విజయలక్ష్మి సదాశివ పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు వద్దగల బీసీ బాలుర హాస్టల్‌ను తహశీల్దార్ చిట్టిబాబు తనిఖీ చేశారు. మొదట రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని వార్డెన్‌కు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో గల బీసీ బాలుర హాస్టల్‌ను ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. తహసీల్దార్ భారతి, వార్డెన్ ఖాదర్‌బాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, జూలై 4: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బళ్లారి జిల్లా సోమసముద్రం గ్రామానికి చెందిన బోయ గాదిలింగ (28) , బోయ వీరేష్ బైక్‌లో గురువారం కళ్యాణదుర్గానికి మిరప విత్తనాలు తీసుకొచ్చారు. వాటిని నర్సరీలో ఇచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గూబనపల్లి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడింది. బోయ గాదిలింగ, బోయ వీరేష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బోయ గాదిలింగ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బోయ వీరేష్‌ను మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సావిత్రి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జడ్చర్ల వద్ద కండ్లపల్లి యువకుడు..

పామిడి: తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్ల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కండ్లపల్లికి చెందిన రమేష్(26) మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా గురువారం అనంతపురం నుంచి హైదరాబాద్‌కు ఓ వాహనంలో బొప్పాయి లోడ్ వేసుకొని బయలుదేరాడు. జడ్చర్ల వద్దకు వెళ్లగానే వాహనం టైర్ పంక్చర్ అయింది. టైర్ మార్చుకుంటుండగా లారీ ఢీ కొట్టి వెళ్లిందని, దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, రామాంజినమ్మ, భార్య వసంత, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిసింది.

పీర్ల మాన్యంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

తాడిపత్రి, జూలై 4: పట్టణంలోని పీర్లమాన్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న అండర్ డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు, రోడ్ల సమస్యలపై స్థానికులను ఆరాతీశారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, మేనేజర్ రాజేశ్వరిబాయి ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గుంతకల్లు, జూలై 4: పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం నిర్వహించిన ఇంట్రా డివిజనల్ కల్చరల్ మీట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఇందులో శాస్త్రీయ, జానపద, సినిమా నృత్యాల పోటీలను, ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహించారు. విజేతలకు శుక్రవారం మధ్యాహ్నం బహుమతుల ప్రదానం చేయనున్నారు. కార్యక్రమానికి రిటైర్డ్ తహసీల్దార్లు ఈఓ రాముడు, జీఎం వెంకటా చలపతి, కేంద్రీయ విద్యాలయ సంగీత ఉపాధ్యాయుడు గౌరవ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు